

## పిడుగుపాటుతో ఇద్దరికి తీవ్ర గాయాలు

**రాయచూరు, మే 20 :** జిల్లాలోని దేవదుర్గ తాలూకా బొమ్మనహళ్లి గ్రామ శివారుల్లో పిడుగుపాటుకు గురైన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ దివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతంలో గొర్లు మేపుతున్న ఇద్దరు వ్యక్తులు సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో వాన ప్రారం భం కావడంతో రక్షణ పొందేందుకు చెట్టు కిందికి చేరారు. అదే సమయంలో పిడుగు పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో హనుమంతి (40) కు కాళ్లు పని చేయకపోగా మరో యువకుడు పరమణ్ణ (20) పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

# అవినీతి ఆగిందని చెప్పలేం

● గ్యారెంటీలతో ప్రతి కుటుంబానికీ మేలు ● ప్రజ్వల్ కేసులో కుట్ర లేదు ● 15-20 ఎంపీ స్థానాల్లో గెలుస్తాం ● అధిష్టానం నిర్ణయం మేరకే మంత్రివర్గంలో మార్పులు : సీఎం సిద్దరామయ్య



మీట్ ది ప్రెస్‌లో సీఎం సిద్ధ రామయ్య

**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో అవినీతి పూర్తిగా ఆగిపోయిందని చెప్పలేనని, దానిని తక్కువ చేసే ప్రయత్నం చేస్తానని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ఏడాదిపాలనపై మీట్ ది ప్రెస్‌లో సోమవారం ముఖ్యమంత్రి సిద్ద రామయ్య పలు అంశాలను పంచుకున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. 9 నెలలుగా అన్ని గ్యారెంటీలు అమలులో ఉన్నాయని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా నగదు బదిలీ చేస్తున్నామని తెలిపారు. గ్యారెంటీల కోసం 2023-24 ఏడాదిలో రూ. 36వేల కోట్లు కేటాయించామని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ లోనే రూ.52వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. కేపిటల్ ఎక్స్‌పెండేచర్‌లో మార్పులు లేకుండా గ్యారెంటీల అమలుకోసం పన్నులను పెంచుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికలకు గ్యారెంటీలతో సంబంధం లేదన్నారు. బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని, ఏడాదిలో జలవనరులకు, పీడబ్ల్యుడీ విభాగానికి బడ్జెట్‌లో నమోదుకంటే ఎక్కువ గ్రాంట్లు విడుదల చేశామన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్‌ను బొమ్మై పాలనలో తొలగించి ఒక్కలిగ, లింగాయతలకు కేటాయించారన్నారు. యథాస్థితిని కొనసాగిస్తామని బొమ్మై ప్రభుత్వం కోర్టుకు స్పష్టం చేసిందన్నారు. దీన్ని బట్టి వారు చెప్పేదొకటి, చేసేదొకటి అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో గ్యారెంటీలతో ప్రతి కుటుంబానికి రూ.5 వేల నుంచి 7 వేల వరకూ ప్రతినెలా అందిస్తున్నామన్నారు. గ్యారెంటీలతో 4.60 కోట్ల మంది లబ్ధి పొందరని తెలిపారు. కుల గణన సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినవారి జాబితాకై రూ.262 కోట్లతో ఐదేళ్ల క్రితం సర్వే జరిపించామని పేర్కొన్నారు. ఇటీవలే నివేదికను స్వీకరించామని, కేబినెట్‌లో చర్చించాక నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం ఏ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులనూ నిలుపుదల చేయలేదన్నారు. ఎన్నికల సభకు అరసికెరెకు వెళ్లినప్పుడు ఓ మహిళ శక్తిగ్యారెంటీ టికెట్లను హారంగా మార్చి తనకు వేసిందన్నారు. ఇంతకంటే అభిమానం ఏముంటుందని తెలిపారు. శక్తి గ్యారెంటీతో ఆలయాల ఆదాయం పెరిగిందని, ఇదే అభిప్రాయాన్ని ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే ప్రత్యేకంగా ఓ లేఖ రాశారని గుర్తు చేశారు. ఎక్కువ ఆదాయం కల్గిన గుడుల నుంచి తక్కువ ఆదాయం వచ్చేవాటికి సర్దుబాటు చేయాలనే తమ ఆలోచన వక్రీకరణ కావడంతో వదులుకున్నామని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఢోకా లేదని, అయితే కొన్ని హత్యలు బాధాకరమని పేర్కొన్నారు. హుబ్బళ్లిలో నేహా, అంజలి హత్యలు దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. గతంలోనూ హత్యలు జరిగాయని, వాటిని వెనకేసుకు రావడం లేదన్నారు. రైతులకు అందించే కరువుసాయం నిధులను బ్యాంకులు వడ్డీలు, అప్పులంటూ జమ చేసుకునేందుకు వీలులేదని, ఈమేరకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. ప్రజ్వల్ వివాదంలో రాజకీయ కుట్ర లేదన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే దేవరాజెగౌడ జేడీఎస్‌తో మైత్రి వద్దని పెన్‌డ్రైవ్‌ల అంశాన్ని బీజేపీ అగ్రనేత అమిత్‌షాకు లేఖ రాసినా వారు స్పందించలేదన్నారు. ఏప్రిల్ 26న పోలింగ్ జరిగాక ప్రజ్వల్ దేశం విడిచి వెళ్లారన్నారు. దేవెగౌడ కుటుంబంపై కుట్ర లేదన్నారు. వారికి అంతా తెలిసిన విషయమే అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 15-20 స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఫలితాల తర్వాత మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కేవలం ప్రచారమే అన్నారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతా అన్నారు. ఏడాది పాలనలో సంతృప్తి చెందానని, మరిన్ని అంశాలు ప్రస్తావించేందుకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా ఉందన్నారు.

## కాంగ్రెస్ సాధించింది శూన్యం

● ఏడాది పాలనపై మండిపడ్డ బీజేపీ నేతలు



**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** కన్నడిగుల చెవిలో పూలు పెట్టి ఐదు గ్యారెంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది ముగిసిందని, సాధించింది శూన్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించింది శూన్యమన్నారు. అబద్ధాలు, మోసాలతో కన్నడిగులు ప్రశాంతతను కోల్పోయేలా చేశారని పేర్కొన్నారు. ఏడాది పాలనలో దోపిడీలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం దక్కలేదన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని, రాష్ట్రం దివాళా తీసిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా పలు కార్టూన్లను విడుదల చేశారు. ఏడాది పాలనలో సాధించింది శూన్యమనే ప్రత్యేక పోస్టర్‌లను విడుదల చేశారు. సమావేశంలో పార్టీ నేత అశ్వత్థనారాయణ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు

## సీఎంకు డీకే శుభాకాంక్షలు

**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ఏడాదిపాలన పూర్తి చేసుకోవడంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యను డీసీఎం డీకే శివకుమార్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాత్రి సిద్దరామయ్యను డీసీఎం భేటీ అయ్యారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఏడాదిపాలన విజయవంతం కావడాన్ని డీసీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్దామన్నారు. అదే విధంగా సీఎం కూడా డీసీఎంను అభినందించారు.



సీఎం సిద్దరామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

## మా కుటుంబికుల ఫోన్లు ట్యాపింగ్

● మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి



**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** తమ కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయని మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి ఆరోపించారు. సోమవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ తన చుట్టూ ఉండే 45మంది మొబైల్ ఫోన్లను ట్యాప్ చేశారని అన్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఎల్ఆర్ శివరామేగౌడ కలసి దేవెగౌడ కుటుంబంపై కుట్ర పన్నారనే ఆడియో రుజువు చేస్తోందన్నారు. శివకుమార్ పాత్ర స్పష్టమైందని, ఇద్దరిపైనా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆడియో, వీడియో ఒరిజినల్ లేదా నకిలీయా అనేది బయటకు రావాలన్నారు. డీకే శివకుమార్ ఇలాంటి రాజకీయాలు చేయాలా అని ప్రశ్నించారు. తాను రక్షణకోసం మాట్లాడడం లేదని ప్రజ్వల్ అంశం వెలుగులోకి వచ్చిన తొలిరోజునే చెప్పినట్టుగా ఉప్పు తిన్నవారు నీరు తాగాల్సిందే అన్న మాటకు కట్టుబడ్డానని పేర్కొన్నారు. బాధిత మహిళలు మానసికంగా కుంగిపోరాదన్నారు. మేం మానవత్వం ఉన్న వారమన్నారు. మా విషయాలు ఫోన్ ట్యాపింగ్ ద్వారానే తెలుసుకుంటున్నారని ఆరోపించారు.

## వరుసగా పరిషత్ ఎన్నికలు

● జూన్ 3న ఆరు స్థానాలకు.. 13న 11 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్

**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ఎన్నికల ప్రహసనం కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికలు ముగియకముందే ఆరు పరిషత్ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. మూడు పట్టభద్రులు, మూడు ఉపాధ్యాయ స్థానాలకు జూన్ 3న పోలింగ్ జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల వేడి కొనసాగుతున్న తరుణంలోనే మరో ఎన్నికకు షెడ్యూల్ ఖరారైంది. శాసనసభ్యుల కోటా నుంచి 11 మందిని ఎన్నుకునేందుకు సోమవారం కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 27న నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజునుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. జూన్ 3వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. 4న నామినేషన్ల పరిశీలన, 6వ తేదీవరకు ఉపసంహరణకు గడువు ఉంది. జూన్ 13న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు అదే రోజున సాయంత్ర 5గంటలకు ప్రారంభమవుతుంది. జూన్ 15తో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. జూన్ 17తో 11 మంది ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనున్న తరుణంలో షెడ్యూల్ విడుదల చేశారు. పదవీ విరమణ పొందేవారిలో సభా నాయకుడు, మంత్రి బోసరాజు, అరవిందకుమార్ అరళి, కె.గోవిందరాజు, మునిరాజుగౌడ, బీఎం ఫరూఖ్, రఘునాథరావ్ మల్కాపుర, ఎన్.రవికుమార్, రుద్రేగౌడ, హరీశ్‌కుమార్ ఉన్నారు. డాక్టర్ తేజస్విగౌడ, కేపీ నంజుండి ఇటీవల ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఇలా 11మంది ఎమ్మెల్సీ పదవులకు దూరం కానున్నారు. వీరిలో మరోసారి టిక్కెట్ ఎవరికి దక్కనుందో అనేది సర్వత్రా కుతూహలం రేపుతోంది.



## లైంగిక దౌర్జన్యం కేసులో...
## జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణకు బెయిల్



**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** హాసన్ జిల్లా హొళెనరసీపుర జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు లైంగిక దౌర్జన్యం కేసులో బెయిల్ మంజూరయింది. బెంగళూరు 42వ ఏసీఎంఎం కోర్టులో సోమవారం విచారణలు సాగాయి. ఈ మేరకు రేవణ్ణకు షరతులతో కూడిన బెయిల్‌ను న్యాయమూర్తి జె. ప్రీత్ మంజూరు చేశారు. రూ.5లక్షల పూచీకత్తుతోపాటు ఒకరి జామీను సమర్పించాలని సూచించారు. ఇప్పటికే హాసన్ జిల్లా హొళెనరసీపురలో రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వెలుగులోకి వచ్చాయి. బాధిత మహిళ ఫిర్యాదుతో రేవణ్ణను ఏ1 నిందితుడిని చేస్తూ కేసు నమోదైంది. ప్రజ్వల్ దేశం విడిచి పరారీ కాగా రేవణ్ణ ఇక్కడే ఉంటూ కేసులను ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటీషన్ దాఖలు చేసుకోగా విచారణలు కొనసాగుతుండగానే ఫిర్యాదు చేసిన మహిళను కిడ్నాప్ చేశారనే మరో కేసు నమోదైంది. కిడ్నాప్ కేసులో రేవణ్ణ అరెస్టు అయి ఆరు రోజులు జైలులో గడిపి బెయిల్‌పై బయటకు వచ్చారు. తాజాగా లైంగిక ఆరోపణల కేసులోనూ బెయిల్ మంజూరైంది. దీంతో రేవణ్ణ ప్రస్తుతానికి నమోదైన కేసుల ద్వారా ఉపశమనం పొందినట్లయ్యింది.

## రైతు ఇంటికి రూ.8.75 లక్షల విద్యుత్ బిల్లు



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న రైతు

**హోసూరు(సిప్‌కాట్), మే 20:** తమిళనాడు రాష్ట్రం హోసూరు తాలూకా కెలమంగలం సమీపంలోని చిన్నట్టి గ్రామంలో నివాసముంటున్న ఓ రైతు ఇంటికి విద్యుత్ బిల్లు రూ.8,75,550 వచ్చింది. దీంతో ఆ రైతు అవాక్కయ్యాడు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. చిన్నట్టి గ్రామంలో వెంకటేశ్ అనే రైతు నివాసం ఉంటున్నారు. అతడి కుటుంబంలో మొత్తం ఐదుగురు సభ్యులు ఉన్నారు. వారిలో ఎక్కువ మంది వ్యవసాయ పనుల కోసం బయటకు వెళతారు. తమిళనాడు ప్రభుత్వం 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కల్పిస్తోంది. దీంతో చాలాసార్లు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. శుక్రవారం విద్యుత్ బోర్డు నుంచి తన మొబైల్ ఫోన్‌కు ఇంటి విద్యుత్ వినియోగదారు కనెక్షన్ నెంబర్‌కు రూ.8,75,550 చెల్లించాలని మెసేజ్ వచ్చిందన్నారు. వెంకటేశ్ తన విద్యుత్ బిల్లును సరిచేయాలని కోరుతూ హోసూరు విద్యుత్ బోర్డు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



# క్షీణించిన శాంతిభద్రతలు



● నాలుగు నెలల్లో 430 హత్యలు, 198 అత్యాచారాలు ● సకాలంలో స్పందించని పోలీసులు




**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ఏకంగా 430 హత్యలు, 198 అత్యాచారాలు జరిగాయి. హుబ్బళ్లిలో విద్యార్థినులు నేహా హిరేమఠ, అంజలి అంబిగెర, కొడగు జిల్లా సోమవారపేట తాలూకాకు చెందిన బాలిక మీనాతోపాటు పలు హత్యకేసులు సంచలనం కలిగించాయి. హుబ్బళ్లిలో ఓ కళాశాలలోని నేహా హిరేమఠ అనే విద్యార్థినిని ఓ ఉన్మాది ప్రేమ నిరాకరించిందనే కారణంతో చాకుతో బహిరంగంగా 11సార్లు పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన జాతీయస్థాయిలో సంచలనమైంది. ఈ కేసు విచారణకు సిట్‌ను ఏర్పాటు చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారు. మిగిలిన కేసులు సంబంధిత పోలీస్ స్టేషన్‌ల పరిధిలోనే ఉన్నాయి. దోపిడీలు, డ్రగ్స్ రవాణా, విక్రయం వంటి కేసులు పెరుగుతున్నాయి. యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి దారుణాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. పోలీసులు డ్రగ్స్ నియంత్రణకోసమే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకుని దాడులు కొనసాగిస్తున్నా వాటి రవాణా, విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. సంపూర్ణంగా డ్రగ్స్‌ను నియంత్రించడం పోలీసులతోనూ సాధ్యం కావడం లేదు. ఇటీవల కొంతకాలంగా యువతులను టార్గెట్ చేసుకుని హత్య చేయడం, దాడులకు పాల్పడ్డం వంటి సంఘటనలు పెరిగాయి. దీంతో తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. సోషల్‌మీడియాలోనూ తల్లిదండ్రుల ఆందోళనకు సంబంధించి తీవ్రమైన చర్చ జరుగుతోంది. హుబ్బళ్లిలో నేహా హిరేమఠ, అంజలి అంబిగెర, బాలిక మీనాను హత్య చేసినవారికి ఉరిశిక్ష విధించాలనే డిమాండ్ పెరుగుతున్నాయి. ఇటీవల బెంగళూరు సుబ్రమణ్యపురలో విద్యార్థిని ప్రబుద్యా (21) అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ సంఘటన కూడా హత్యగా ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువతుల హత్య, దాడులతో పురుషులపై చెడు అభిప్రాయం కూడా పెరిగిన పరిస్థితి కొనసాగుతోంది.

### పోలీసుల నిర్లక్ష్యం

కొన్ని నేరాలకు సంబంధించి ముందుగా పోలీసులకు సమాచారం ఉన్నా సకాలంలో వారు స్పందించకపోవడంతోనే దారుణాలు చోటు చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. అంజలి అంబిగెరను ప్రేమ నిరాకరించినందుకు నేహా హిరేమఠ తరహాలోనే హతమారుస్తానని గిరీశ్ బెదరించాడు. ఇదే సమాచారాన్ని పోలీసులకు అంజలి కుటుంబసభ్యులతో కలసి వివరించారు. అటువంటిదేమీ జరగదని, మీరు ప్రశాంతంగా ఇళ్లకు వెళ్లాలని పోలీసులు సూచించారు. గిరీశ్ నేరప్రవృత్తి కల్గినవాడైనా పోలీసులు నిర్లక్ష్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే కారణంతోనే ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రేఖాతోపాటు పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. ముందస్తుగా చొరవ చూపి ఉంటే ఇటువంటి పరిస్థితి ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారి తప్పడానికి సిబ్బంది కొరత ప్రధాన కారణంగా ఉంది. ఉన్న సిబ్బంది 24 గంటలపాటు పనిచేయాల్సి రావడంతో ఒక్కోసారి విధి నిర్వహణలోనూ ఇబ్బంది పడే పరిస్థితి కొనసాగుతోందని ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు. చిక్కమగళూరు, రామనగరలలో పోలీసులు, న్యాయవాదుల మధ్య గొడవలు జరిగాయి. పోలీసులపైనే కేసులు నమోదు చేశారు. బాధితులు ఫిర్యాదు చేసినా సీనియర్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, పైగా రాజీ చేసుకోవాలని కూడా సూచిస్తున్న ఘటనలు ఉన్నాయి. ఇదే విషయమై పోలీసులు వాట్సప్ గ్రూపుల ద్వారా ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.

### హత్యకేసుల వివరాలు ఇలా..

2022లో 1370 హత్యలు చోటు చేసుకోగా 2023లో 1295, 2024 జనవరి నుంచి ఏప్రిల్ దాకా 430 హత్యలు జరిగాయి. 2022లో అత్యాచారాలు 537, మహిళలపై దౌర్జన్యాలు 5,862, పిల్లలపై దౌర్జన్యాలు 3,192, దాడులు 15,372, సైబర్ క్రైమ్ 12,557, మోసాలు 6,411, దోపిడీలు 1069 కాగా 2023లో అత్యాచారాలు 639, మహిళలపై దౌర్జన్యాలు 6,486, పిల్లలపై దౌర్జన్యాలు 3,856, దాడులు 17,439, సైబర్ క్రైమ్ 21,895, మోసాలు 6,921, దోపిడీలు 1248గా ఉన్నాయి. 2024లో నాలుగు నెలల అవధిలోనే అత్యాచారాలు 198, మహిళలపై దౌర్జన్యాలు 2,327, బాలికలపై దౌర్జన్యాలు 1262, దాడులు 6,063, సైబర్ క్రైమ్ 7,421, మోసాలు 2,243, దోపిడీలు 450 ఉన్నాయి. ఇటీవల సైబర్ క్రైమ్ నేరాలు పెరిగిపోతున్నాయి. విదేశాలకు కొరియర్ల ద్వారా పార్శిళ్లు పంపే వారిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ముంబైకు చెందిన ఓ ముఠా కోట్లాది రూపాయలు మోసం చేసింది. న్యాయవాదులను సైతం వదలలేదు. ఐటీ, పారిశ్రామికవేత్తలను ఈడీ, ముంబై సైబర్‌క్రైమ్ పేరిట మోసాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలు విమర్శలు చేస్తున్నాయి. అందుకు అనుగుణంగానే రోజూ ఏదో ఒక ప్రాంతంలో సంచలనం కలిగించే నేరాలు కొనసాగుతున్నాయి. నేరాల నివారణకు ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1,577.53 | 1,578.92 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 0 | 1093 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 0 | 251 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 3.38 | 3.97 |

# కదంతొక్కిన కర్షకులు

- సమస్యలపై రోడ్డెక్కిన అన్నదాత
- రుణమాఫీ, పంటనష్ట పరిహారం అందించాలని డిమాండ్


**బళ్లారి సిటీ, మే 20:** పలు రైతు సమస్యలపై అన్నదాత కదం తొక్కారు. అన్ని పంటలకు నష్టపరిహారం, బ్యాంకుల్లో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం గాంధీభవన్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతి ప్రతం సమర్పించారు. ఈసందర్భంగా సంఘం జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ... జిల్లాలోని 5తాలూకాలతో పాటు 223తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినా రైతుకు దక్కిందేమీ లేదన్నారు. అన్ని పంటలకు నష్టపరిహారం చెల్లించి, రుణమాఫీ చేయాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్యలు పరిష్కరించాలని, పశువులు, దూడలకు దాణా బ్యాంకులు నిర్మించాలన్నారు. నరేగా పథకం కింద రూ.600 వేతనం చెల్లించాలని, అప్పుడే కరువు పరిస్థితిని అరికట్టవచ్చన్నారు. నిరసన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి గురల్లి రాజా అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కరువు విలయ తాండవం చేసిందన్నారు. కేంద్రం, రాష్ట్రం రైతులకు న్యాయం చేయాలన్నారు. సంపన్నులకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ చేసిన కేంద్రానికి రైతులకు న్యాయం చేయడానికి చేతులు రావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టకుంటే రాష్ట్ర రైతాంగం బలమైన పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు హనుమంతప్ప, జిల్లా ఉపాధ్యక్షులు బసన్న, యువజన నాయకుడు కోళూరు పంపాపతి, బళ్లారితాలూకా అధ్యక్షుడు ఈరన్న, కురుగోడు తాలూకా అధ్యక్షుడు లింగప్ప, కార్యదర్శి బసవరాజ్, జిల్లాకమిటీ సభ్యుడు అనిల్, రైతులు రెహమాన్. హనుమంతప్ప, కాళప్ప, భైరాపుర హనుమంతప్ప, రుద్రయ్య, కాళిదాసు.హొన్నూర్‌స్వామి, హరిజన హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో అఖిల భారత రైతు కృషి కార్మికుల సంఘం నాయకులు

## 23న వెంకటరమణస్వామి బ్రహ్మారథోత్సవం

**బళ్లారిరూరల్, మే 20 :** బళ్లారి తాలుకాలోని రూపనగుడి గ్రామంలో వెలసిన వెంకటరమణ స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23వ తేదీ గురువారం స్వామి బ్రహ్మారథోత్సవాన్ని నిర్వహించ నున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు తెలిపారు.



## కల్తీ విత్తనాలపై నిఘా ఉంచాలి

- జిల్లా అధికారికి రైతు సంఘం నాయకుల వినతి

**రాయచూరు, మే 20 :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు సాగుకు సిద్ధమవుతన్నారని, కల్తీ విత్తనాలపై అధికారులు నిఘా పెంచాలని కర్ణాటక రైతు సంఘం, హసిరుసేన నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని ఇప్పటికే అనేక చోట్ల కల్తీ విత్తనాలు పెద్ద ఎత్తున విక్రయం జరుగుతున్నట్లు ఆరోపించిన నాయకులు సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. విత్తన కంపెనీల పై నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాలన్నారు. గత ఏడాది వర్షభావ పరిస్థితిల వల్ల రైతులు ఆర్థికంగా కుంగిపోయిన నేపథ్యంలో ఈ ఏడాది రైతులకు ప్రభుత్వం మరింత అండగా నిలవాలన్నారు. అదే సమయంలో ప్రస్తుత సీజన్‌లో వర్షాలు ఇప్పటికే ప్రారంభమవుతున్నందున వ్యాపారులు దీన్ని అదునుగా చేసుకుని కల్తీ విత్తనాలు రైతులకు అంటగట్టే ప్రమాదం ఉందన్నారు. దీంతో పాటు విత్తనాలకు డిమాండ్ పెరగడంతో రేట్లు కూడా పెంచి రైతులను దోచేస్తున్నారని, వీరి పై నిఘా ఉంచాలని కోరారు.


డీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు


వ్యర్థాలను సేకరిస్తున్న యూత్ బ్రిగేడ్ సభ్యులు

## తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో స్వచ్ఛత పనులు

**బళ్లారి సిటీ, మే 20:** తుంగభద్ర బ్యాక్ వాటర్ ఖాళీ పరీవాహక ప్రాంతంలో హొస్పేట్ యూత్ బ్రిగేడ్ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా పనులు చేపట్టారు. తుంగభద్ర డ్యామ్ వెనుక నీటి ప్రాంతంలో మద్య బాటిళ్ళు చెత్త, వ్యర్థ పదార్థాలను పారవే యడంతో అపరిశుభ్రంగా తయారయ్యింది. ఈ సందర్భంగా వారు పరిశుభ్రత, పర్యావరణంపై స్థానికులకు అవగాహన కల్పించారు. కర్ణాటకకు జీవనాధారమైన తుంగభద్రను అందరూ కాపాడు కోవాలని, వర్షాకాలం ప్రారంభం కాక ముందే మరికొద్ది రోజుల్లో పొంగిపొర్లబోతుందన్నారు. కాల్వలను పరిశుభ్రం చేస్తే మరింత నీరు నిల్వ ఉండి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

## నేడు లోకాయుక్త ఎస్పీ రాక

**సిరుగుప్ప, మే 20 :** లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు మంగళవారం సిరుగుప్పలో పర్యటించనున్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన తహశీల్దార్ షంషాలం ఎస్పీ తాలుకాలో ప్రజాసమస్యలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా లోకాయుక్త అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కావున తాలుకా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## అందానికి ప్రతిబింబాలు


విజయవిఠల దేవస్థానం వద్ద ఆకట్టుకుంటున్న రాతిరథం, ఆలయ గోపురం ప్రతిబింబాలు

**కంప్లి, మే 20 :** పర్యాటక ప్రాంతం హంపిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. వేసవి సెలవుల కారణంగా హంపిలో పర్యాటకుల సందడి నెలకొంది. వర్షం కారణంగా వాతావరణం చల్లబడి హంపి పరిసరాలు ఆహ్లాదంగా మారాయి. పర్యాటకులు వర్షంలో శిల్పకళలను తనివితీరా సందర్శిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాతి కట్టడాల ప్రతిబింబాలు వర్షపు నీటిలో కనిపిస్తూ మరింత ఆనందాన్ని పంచుతున్నాయి. విజయవిఠల దేవస్థానం రాతిరథం, మంటపాలు, అలాగే తేరు బజారు, మండపాల వద్ద పర్యాటకుల సందడి కనిపించింది.


ఆకట్టుకుంటున్న మండపాల ప్రతిబింబాలు

## భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి..



ర్యాలీగా వస్తున్న సీఐటీయూ నాయకులు, రైతు సంఘం సభ్యులు

**తోరణగల్లు, మే 20 :** జిందాల్ పరిశ్రమ స్థాపించినప్పుడు భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు, స్థానిక చదువుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మంజునాథ్ డిమాండ్ చేశారు. సోమవారం జిందాల్ ఓల్డ్ గేటు ముందు సీఐటీయూ రైతు మహిళా దళిత యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తోరణగల్లు స్టేషన్‌లోని హైవే బ్రిడ్జి నుంచి రైతు సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉప తహసీల్దార్ సుబ్బారావు దేశాయ్, కార్మికశాఖ అధికారి వరుణ్ రామ్‌కు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఓల్డ్ గేటు ముందు బైఠాయించి ప్రతిఘటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ స్థాపించనప్పుడు రైతు కుటుంబాలలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆశపడ్డారని కానీ రైతులకు న్యాయం జరగలేదన్నారు. స్థానికులకు రైతు కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు గురైన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ప్రాణాల రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టాలని అప్పుడే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే బృహత్ ప్రతిఘటనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సత్యబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న బసయ్య, ప్రముఖులు శివ శంకరయ్య, తిప్పేస్వామి, ఓబుళేషయ్య, ఖలందర్ బాషా, ఏ స్వామి, కాలవ అర్జున పాల్గొన్నారు.

## జొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

**సిరుగుప్ప, మే 20 :** రైతు సమస్యలు తక్షణమే పరిష్కరించాలని బీజేపీ నాయకులు ధరప్పనాయక డిమాండ్ చేశారు. సోమవారం జొన్న కోలుగోలులో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ యార్డు నుంచి దేవలాపురం క్రాస్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడు తూ ప్రభుత్వం తక్షణం స్పందించి జొన్నలు కొనుగోలు చేయాల న్నారు. అధికారులు సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించుకున్నారు.


ప్రధాన రహదారిలో బైఠాయించి నిరసన చేపట్టిన బీజేపీ నాయకులు ధరప్ప నాయక, జొన్నల రైతులు

## ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

**బళ్లారిరూరల్, మే 20 :** నగరంలోని బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ సమీపంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఐదు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. చివరి రోజు సోమవారం వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటంతో భక్తులు పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘురామయ్య, శ్రీమతి రమాదేవి ఉపేంద్ర, వేదావతి, అనిల్, నటరాజ్, గీత, పద్మావతి, సుభాష్, ఆచారి పద్మావతి, వీరేష్, వీణ, గణేష్, నాగ లింగ స్వామి భక్తాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

## ఒక్కటైన 16 జంటలు

**కంప్లి, మే 20 :** సామూహిక వివాహంలో 16 జంటలు ఏకమయ్యాయి. ఉజ్జిని గ్రామంలో మరళసిద్దేశ్వర రథోత్సవం సందర్భంగా ఉజ్జిని పీఠాధీశ్వరులు సిద్దలింగ రాజదేశీ కేంద్ర శివాచార్య మహాస్వాములు సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 16 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ గ్రామాల్లో సంఘ సంస్థలు, మఠాధీశ్వరులు జరిపే సామూహిక వివాహాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెరిగిన ధరలతో వివాహం భారం కాకూడదనే పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు.


వివాహ వేడుకల్లో వధూవరులు

## వైద్యసేవలు నిబద్ధతతో చేపట్టాలి

**రాయచూరు, మే 20 :** వైద్య సేవలు మానవీయ విలువలతో కూడినవని వాటి నిర్వహణలో నిబద్ధత అవసరమని రిమ్స్ బోధన ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రమేష్ సూచించారు. నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు తమ విధుల నిర్వహణలో ఏకాగ్రతతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బోధన ఆస్పత్రి రిమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన నాల్గవ బ్యాచ్ విద్యార్థులకు సోమవారం పట్టాలు పంపిణీ చేసి ప్రమాణ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రిమ్స్ పాలనాధికారి గురుసిద్ధయ్య హిరేమఠ, నర్సింగ్ వృత్తి అత్యంత పవిత్రమైందని నర్సింగ్ చేవలను దైవకార్యంగా భావించి వృత్తిలో రాణించి మంచిపేరు తెచ్చకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.బసవరాజ్ ఎం.పాటీల్ మాట్లాడుతు వైద్య సేవల్లో నర్సింగ్ సేవలు అత్యంత కీలకమైనవన్నవి వైద్య రంగానికంతటికి నర్సులు అందించే సేవలు వెన్నెముకలాంటివన్నారు. తమ వృత్తికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి అందుకు తగిన రీతిలో విధులు నిర్వహించాలని విద్యార్థులకు సూచించారు.

## నగర రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి: అంబేడ్కర్ సేన


డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న అంబేడ్కర్‌సేన నాయకులు

**రాయచూరు, మే 20 :** నగరంలో పూర్తిగా విధ్వంసమైపోయిన రోడ్లను వెంటనే శాశ్వత యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని అంబేడ్కర్‌సేన నాయకులు కోరారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. గడచిన మూడు రోజుల క్రితం నుంచి కురుస్తున్న ఒక మోస్తరు వర్షాలకే నగరంలో ప్రధాన రోడ్లన్నీ చెరువులుగా మారాయన్నారు. ముఖ్యంగా ఆర్టీఓ సర్కిల్, శంవాలం దర్గా ముందు చంద్రబండా క్రాస్ వద్ద ఉన్న ప్రధాన రోడ్డు అనంతరం ఒపెక్ ఆస్పత్రి సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్దగల రోడ్డు పూర్తిగా విధ్వంసమైందన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో ఈ ప్రాంతమంతా జలమయం కావడంతో వాహనదారులు అవస్థలు పడినట్లు అధికారులకు వివరించారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు జరిగిన సందర్భంగా పలు ప్రమాదాలు జరిగాయని అధికారులకు వివరించారు. తక్షణం ప్రధాన రోడ్ల మరమత్తు పనులను చేపట్టాలని కోరారు.

## గుడిసె కూలి నాలుగు మేకల మృతి

- భారీ వర్షాలతో నేల రాలిన విద్యుత్ స్తంభాలు

**బళ్లారి సిటీ, మే 20:** వర్షాలకు గుడిసె కూలి నాలుగు మేకలు మృతి చెందాయి. కూడ్లిగి తాలూకా అమలాపూర్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షాలకు తిరుమలేశ్‌కు చెందిన గుడిసె కూలి దాని కింద ఉన్న నాలుగు మేకలు మృతి చెందాయి. కూడ్లిగి పరిసర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. సాయంత్రం బనవినకల్లు, కూడ్లిగి, హొసహళ్ళి, చిక్కజోగిహళ్లి పరిదిలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గుడిసె కూలిన ఘటనలో జరిగిన నష్టాన్ని గ్రామ అకౌంటెంట్ అధికారి హొసహళ్ళి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్‌కు నివేదిక సమర్పించారు.


మృతి చెందిన మేకలను చూపుతున్న రైతు తిరుమలేశ్

## నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


అనంత శయన గుడి వద్ద కూలిపోయిన విద్యుత్ స్తంభం

**కంప్లి :** భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కూడ్లిగి తాలుకా శివపుర, జంగమసువేనళ్లి గ్రామాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో భూమి పూర్తి తేమ శాతం ఏర్పడింది. చెక్‌డ్యామ్‌లు కూడా పూర్తిగా నిండిపోయాయి. హొస్పేట తాలుకా పరిధిలోని అనంతశయన దేవాలయం ప్రాంతాల్లో వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి.


శివపురం వద్ద ప్రవహిస్తున్న వాగు

## హోసూరు జోన్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు

### బీజేపీలో పలువురి చేరిక

**హోసూరు, మే 20:** హోసూరు నగరం 40వ వార్డు పార్వతీనగర్ బీజేపీ కార్యాలయంలో సోమవారం పలువురు పార్టీలో చేరారు. కమండొడ్డి ప్రాంతానికి చెందిన శివ, ఆయన మద్దతుదారులు 50 మంది రాష్ట్ర మహాసభ సభ్యుడు నారాయణ స్వామి ఆధ్వర్యంల్లో జిల్లా ఉపాధ్యాక్షుడు నాగరాజ్ సమక్షంల్లో బీజేపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ పార్టీ కండువాలతో ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మురుగన్, సంస్థేతర విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పార్టీ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

### రైల్వే అండర్‌పాస్‌లో నీరు - ప్రయాణికులకు ఇక్కట్లు


రోడ్డుపై వేచియున్న వాహనదారులు


అండర్‌పాస్‌లో ఆగిన నీరు

**హోసూరు, మే 20:** నగరంలో అకస్మాత్తుగా కురిసిన వర్షానికి హోసూరు రైల్వే అండర్‌పాస్ ప్రదేశం చెరువును తలపించింది. ఆదివారం సాయంత్రం గంటకుపైగా వర్షం కురిసింది. అండర్ పాస్‌లో నీరు సజావుగా ప్రవహించకపోవడంతో నిల్వగా చేరింది. భారీ వర్షం కారణంగా హోసూరు బస్టాండు, బాగలూరు రోడ్డు సర్కిల్, జీఆర్‌టీ సర్కిల్‌తో పాటు పలుచోట్ల వర్షపు నీరు వరదలా నిలిచిపోయింది. రైల్వే అండర్‌పాస్‌లో మోకాలిలోతు వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దీంతో సంచారాన్ని ఆపేశారు. చాలాసేపు వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి చాలాదూరం బారులు తీరాయి. హోసూరులో 7.90 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. హోసూరు డెంకణీకోట రహదారిపై రెండు వంతెనలు ఉన్నాయి. హోసూరుల్లో డబుల్ రైలు మార్గం నిర్మాణం కారణంగా డెంకణీకోట రోడ్డులో రైల్వే ఫ్లైఓవర్, రైల్వే రోడ్డులో అండర్‌పాస్ నిర్మించారు. ఆరు నెలలకు పైగా డెంకణీకోట రోడ్డులో ఫ్లైఓవర్ నిలిచిపోయింది. రోడ్లు అందుబాటులో ఉన్నప్పటికి ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారతీదాసన్ నగర్ ప్రాంతంలోని రైల్వే అండర్‌పాస్ మీదుగా వేలాది ద్విచక్ర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ నెలకొంది. చివరకు వర్షపునీటిని పంపింగ్ చేసి రాకపోకలకు వీలు కల్పించారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### రాజీవ్‌గాంధీ (వర్ధంతి)



కాంగ్రెస్ అగ్రనేత, దేశ ఆరో ప్రధానిగా వ్యవహరించిన రాజీవ్ గాంధీ 1944 ఆగస్టు 20న బాంబే లో జన్మించారు. ఇందిరా గాంధీ, ఫిరోజ్‌గాంధీ పెద్ద కుమారుడు. తల్లి మరణంతో అనూహ్యంగా ప్రధాని అయ్యారు. 1984 నుంచి 1989వ వరకు ప్రధానిగా కొన సాగారు. 40 ఏళ్లకే ప్రధాని కావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడి గా వ్యవహరించారు. ప్రధానమంత్రిగా దూరదృష్టితో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. తమిళనాడు రాష్ట్రం శ్రీపెరుంబు దూరులో ఎల్‌టీటీఈ చేసిన మానవబాంబు దాడిలో 1991 మే 21న ఆయన కన్ను మూశారు. ఆయన వర్ధంతిని జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినంగా ఆచరిస్తున్నారు. ఆయన సేవలకు దేశ అత్యున్నత 'భారతరత్న' పురస్కారం ప్రకటించారు. కాగా ఆయన కుమారుడు, కుమార్తె రాజకీయాల్లో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు.

### ఉస్తాద్ సబ్రీఖాన్ (జయంతి)



ఉస్తాద్ సబ్రీఖాన్ 1927 మే 21న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మొరాదాబాద్‌లో జన్మించారు. ప్రసిద్ధ సారంగి వాద్యకారులు. 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి స్వాతంత్ర్య ఉత్సవాలలో ఆయన సారంగి వాయించారు. సితార్ వాదకుడు పండిట్ రవిశంకర్, తబలా వాదకుడు అల్లారఖాతో కలసి పలు కచేరీలలో పాల్గొన్నారు. 21కుపైగా దేశాలలో పర్యటించి కచేరీలు ఇచ్చారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అంతిమ ఘడియల్లో ఉన్నప్పుడు కూడా సారంగి వాయించారు. హిందూస్తానీ సంగీతంలోనూ, శాస్త్రీయ సంగీతంలోనూ రాణించారు. ఆయన కుమారుడు, మనవడు కూడా సారంగిలో రాణించారు. ఆకాశవాణితో 50ఏళ్ల అనుబంధం ఉంది. 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' పురస్కారాలు, జాతీయ సంగీత నాటక అకాడమీ అవార్డు, సాహిత్య కళా పరిషత్ అవార్డు ఇతరత్రా అందుకున్నారు. 2015 డిసెంబరు 1న కన్నుమూశారు.

### మోహన్‌లాల్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత మోహన్‌లాల్ విశ్వనాథన్ 1960 మే 21న జన్మించారు. నటుడు, నిర్మాత, నేపథ్య గాయకుడు, డిస్ట్రి బ్యూటర్. మలయాళ సినిమా రంగంలో రాణించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల సినిమా లలోనూ నటించారు. నాలుగు దశాబ్దాలలో 340కు పైగా సినిమాలలో నటించారు. 5 జాతీయ ఫిల్మ్‌అవార్డులు, రెండుసార్లు ఉత్తమ నటుడు, స్పెషల్ జ్యూరీ అవార్డు, 'పద్మశ్రీ' ఇతర అవార్డులు అందుకున్నారు. 2009లో టెర్రిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదా అందుకున్న తొలి నటుడు. విశ్వ శాంతి ఫౌండేషన్ ద్వారా సమాజసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## నగరేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు



స్వామివారికి విశేష అలంకరణ

**శిడ్లఘట్ట, మే 20:** పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా సోమవారం విశేషపూజలు కొనసాగాయి. పట్టణంలోని నగరేశ్వర, సోమేశ్వర, చంద్రశేఖర, మలె మల్లేశ్వర, గవి గంగాధరేశ్వర, చిక్కదాసరహళ్ళిలోని ఆలయంలోనూ, మంజునాథస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శుద్ధి అనంతరం స్వామివార్లకు బిల్వార్చన సేవ, పుష్పాలంకరణ, రుద్రాక్ష అలంకరణ, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తబృందం కీర్తనలు ఆలపించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


## అదుపు తప్పిన కారు.. ఐదుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆనంద్

**విడపనకల్లు, మే 20:** అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామం వద్ద బళ్లారి-అనంతపురం 42వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట జిల్లా ఇలుకల్లు పట్టణానికి చెందిన ఐదుగురు స్నేహితులు నాలుగు రోజుల కిందట కారులో తిరుమలకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి సొంతూరికి బయల్దేరారు. సోమవారం తెల్లవారు జామున 5గంటల సమయంలో పెద్ద కొట్టాలపల్లి వద్ద రహదారిపై పడి ఉన్న గేదె కళేబరాన్ని కారుతో ఢీ కొట్టారు. దీంతో కారు అదుపుతప్పి ఎడమ వైపు నుంచి కుడి వైపునకు వెళ్లి చెట్టును ఢీ కొట్టి పొలాల్లో పడింది. దీంతో కారులో ఉన్న ఐదుగురు స్నేహితుల్లో ఆనందు, సురేష్ తీవ్రంగా గాయపడగా, బసవ రాజు, గిరీష్, అదానప్ప స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గాయపడిన వారిని బళ్లారి ఆసుపత్రికి తరలించినట్లు విడపనకల్లు పోలీసులు తెలిపారు.

# డాప్లర్ వెదర్ రాడార్ కేంద్రం కోసం స్థల పరిశీలన



డాప్లర్ వెదర్ రాడార్ (ఫైల్)

**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** సమగ్ర వాతావరణ సమాచారం సేకరించేందుకు నగర పరిధిలో డాప్లర్ వెదర్ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. నగరంలో 25 అంతస్తుల భవనం కోసం వాతావరణ పరిశోధనశాఖ స్థల పరిశీలనలు కొనసాగిస్తోంది. రాడార్ ఏర్పాటుతో కనీసం 30-40 కిలోమీటర్ల పరిధిలో భారీ భవనాలు ఉండరాదు. రాడార్‌కు ఎలక్ట్రానిక్ సిగ్నల్స్ రావడం అంతరాయం కానుంది. అటువంటి భవనంకోసం నగర వ్యాప్తంగా పరిశీలనలు చేస్తున్నారు. గతంలో ఇటువంటి భవనం అందుబాటులో ఉన్నా రాడార్ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు లభించకపోవడంతో సాధ్యం కాలేదు. 25 అంతస్తులు అంతకంటే ఎక్కువ ఎత్తులో రాడార్ అమర్చడం ద్వారా వాతావరణానికి సంబంధించి సమగ్ర సమాచారం అందనుందని వాతావరణ పరిశోధనశాఖ అధికారి ఒకరు తెలిపారు. హెసరఘట్ట, జీకేవీకే పరిసరాలలో పరి శీలించినా అక్కడ రాడార్ అమర్చేందుకు సాధ్యం కాదని వదిలేశారు. ఇప్పటికే తమిళనాడు, గోవాలలో డీడబ్ల్యుఆర్ అమర్చడం ద్వారా ప్రతి 3 గంటలకోసారి వాతావరణంలో మార్పులకు సంబంధించి స్పష్టమైన సమాచారం అందుతోంది. కనీసం 3 రోజులనుంచి 5 రోజులదాకా వాతావరణంపై అంచనా నివేదిక వెల్లడించేందుకు వీలుంటుంది. ప్రపంచబ్యాంకు ఆర్థిక సాయంలో డాప్లర్ వెదర్ రాడార్‌ను బెంగళూరు, మంగళూరులలో ఏర్పాటుకు ప్రస్తావనలు పంపగా ఆమోదం లభించింది. ఒక రాడార్ కేంద్రం ఏర్పాటుతో 10-12 కోట్ల రూపాయలు ఖర్చు కానుంది. దేశవ్యాప్తంగా అత్యధిక తుపాన్లు దాటికి నష్టం జరుగుతోంది. తూర్పుతీర ప్రాంతంలో ఎక్కువ రాడార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోల్కత్తా, పారాదీప్, గోపాలపుర, విశాఖపట్నం, మచిలీపట్నం, శ్రీహరికోట, కరైకల్, చెన్నైతోపాటు పశ్చిమకనుమలలో తిరువనంతపురం, కొచ్చి, గోవా, ముంబైలలో డాప్లర్ వెదర్ రాడార్ సెంటర్‌లు ఉన్నాయి. శ్రీనగర, పటియాలా, ఢిల్లీ, జైపూర్ ప్రాంతాల్లో 27 డాప్లర్ వెదర్ రాడార్‌లు ఉన్నాయి.

### సమగ్ర అధ్యయనం

డాప్లర్ వెదర్ రాడార్ అమర్చడం ద్వారా మేఘాలు, ఉరుములు, పిడుగులతోపాటు గాలిలో వేగానికి సం బంధించి సమగ్ర అధ్యయనం చేయ నుంది. ప్రతి గంటలో వ్యత్యాసాలను, వాతావరణ వైపరీత్యాల స్పష్టతను ఖచ్చితమైన సమాచా రం ఇవ్వనుంది. తద్వారా అధ్యయనంతోపాటు అప్రమత్తం చేసేందుకు వీలుంటుంది. సాంకేతిక సమాచారం ద్వారా స్పష్ట మైన సందేశం ఇవ్వవచ్చు. ప్రతి అరగంటకోసారి మేఘాలలో వచ్చే మార్పులను, ఉపగ్రహ చిత్రాలను అందించనుంది. మేఘాల వేగాన్ని తెలుసుకునేందుకు వీలుంటుంది. సుమారు 200కిలోమీటర్ల దాకా మేఘాల ప్రమాణం ఎంతమేర ఉందో గుర్తించవచ్చునని అధికారులు తెలిపారు.


## విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయండి



వ్యవసాయ శాఖ సహాయక డైరెక్టర్ లక్ష్మీకి వినతిపత్రం అందజేత

**బాగేపల్లి, మే 20:** వర్షాకాలం ప్రారంభం కావడంతో దుక్కులు మొదలయ్యాయి. ఖరీఫ్ ప్రారంభమవుతున్నా వ్యవసాయశాఖలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని రైతుసంఘం డిమాండ్ చేసింది. రైతుకేంద్రం విత్తనాలు, ఎరువుల పంపిణీకి అధికారి, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతుసంఘం, హసిరుసేన (ప్రొఫెసర్ నంజుండస్వామి వర్గ) డిమాండ్ చేసింది. సోమవారం పట్టణంలోని రైతుకేంద్రం వద్ద తాలూకా వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ జీ లక్ష్మీకి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు హెచ్‌ఎన్ గోవిందరెడ్డి మాట్లాడుతూ తొలకరి వర్షాలు కురుస్తున్నాయన్నారు. పొలం పనులకు రైతులు సిద్ధమవుతున్నారని, రైతు కేంద్రాలలో అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి మొక్కజొన్న, రాగులు, వరి, కంది, చిలగడదుంప తదితర విత్తనాలు, రసాయన ఎరువులు పంపిణీ చేయాలన్నారు. అవసరమైన వ్యవసాయ ఉపకరణాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం, హసిరుసేన జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ప్రముఖులు లక్ష్మీనరసప్ప, గంగిరెడ్డి, చౌడరెడ్డి, వెంకటరామరెడ్డి, ఆదినారాయణప్ప, అశ్వత్థప్ప తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం



అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న బీజేపీ ఎస్సీ మోర్చా పదాధికారులు

**బంగారపేట, మే 20:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ఎన్నటికీ స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ మహేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బెంగనూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఆచరించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పగా గుర్తింపు పొందిందన్నారు. రాజ్యాంగంతోనే మానవహక్కుల రక్షణ సాధ్యమన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా ప్రతి భారతీయ పౌరుడికి లభించాలంటే కార్యాంగ, శాసకాంగ, న్యాయాంగ వ్యవస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయాల్సి ఉందన్నారు. సమాజంలో మానవత్వంతోనూ, సామాజికంగా, నైతిక విలువలతో సాగినప్పుడే జీవితానికి సార్థకత సాధ్యమన్నారు. కార్యక్రమంలో బెంగనూరు నారాయణగౌడ, తాలూకా బీజేపీ ప్రధాన కార్యదర్శి హెచ్‌ఆర్ శ్రీనివాస్, బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కెసరనహళ్ళి మంజునాథ్, బత్తలహళ్ళి మంజునాథ్, మధు, ఆంజనేయమూర్తి, కృష్ణప్ప, వెంకటస్వామి, ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న నగరసభ కమిషనర్ మాధవి

**చింతామణి, మే 20:** పట్టణంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్‌లైన్ పక్కనే పట్టణంలోని నెక్కుంది రైల్వేస్టేషన్ కేంద్రానికి కేపీటీసీఎల్ విద్యుత్‌లైన్ అమర్చడం పలు సమస్యలకు కారణమవుతోంది. దీంతో పైప్‌లైన్ మరమ్మతు పనుల కార్యాచరణలో నగరసభ అధికారులకు కేపీటీసీఎల్ అధికారులు చేయూత ఇచ్చారు. పట్టణంలోని బంబూబజార్ మెయిన్‌రోడ్డు పట్టుగూళ్ల మార్కెట్ సమీపాన మలుపులో నెక్కుంది రైల్వేస్టేషన్ కేపీటీసీఎల్ నుంచి 66/25 కేవీ కేబుల్ అమర్చారు. కేబుల్ అమరికలో డ్రైనేజ్‌పైప్‌ను పట్టించుకోకపోవడంతో దెబ్బతింది. దీన్ని నగరసభ దృష్టికి తేకుండా కేపీటీసీఎల్ అధికారులు, కేబుల్ కంట్రాక్టర్ అలాగే మట్టివేసి వదిలేశారు. దీంతో డ్రైనేజీనీరు సజావుగా ప్రవహించక సమస్యగా మారింది. ఎట్టకేలకు మీడియా ద్వారా తెలుసుకుని కేపీటీసీఎల్ అధికారులు స్పందించారు. భారీ పనుల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై వెంకటేశప్ప, స్థానిక కేపీటీసీఎల్ ఏఈఈ తేజస్విని, సివిల్ ఏఈఈ మురళిలు ఘటనా స్థలాన్ని పరిశీలించి మరమ్మతు చర్యలకు సహకారం అందించారు. దీంతో 66కేవీ విద్యుత్‌ను రెండుగంటలపాటు సరఫరా ఆపేశారు. దెబ్బతిన్న పైప్ స్థానంలో కొత్తది అమర్చారు. నగరసభ కమిషనర్ మాధవి, జేఈ ప్రసాదరెడ్డి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ ఇన్‌చార్జ్ సీకే బాబు, బెస్కాం లెక్కాధికారి అశోక్‌రెడ్డి, కేపీటీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిత్రావతి కాలువను పట్టించుకోండి



చిత్రావతి కాలువలో పేరుకున్న వ్యర్థాలు

**బాగేపల్లి, మే 20:** పట్టణంలోని చిత్రావతి నది కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. కాలువ ఫ్లై ఓవర్ చుట్టుపక్కల నుంచి చెత్తాచెదారం వచ్చి చేరుతోంది. కలుషిత నీరు కూడా కాలువలోకి వస్తుండడం కలుషితం అవుతోంది. తాలూకా యంత్రాంగం, పురసభ, గ్రామ పంచాయతీ అధికారులు ఈ దిశగా చొరవ చూపాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పురసభ పరిధిలోని సివిల్ కోర్టు నుంచి నేషనల్ కళాశాల వరకు వ్యాపించి ఉంది. పరగోడు సమీపాన చిత్రావతి ఆనకట్ట నుంచి చిత్రావతి డ్యామ్ నుంచి కాలువ మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు నీరు ప్రవహిస్తుంది. అయితే నది కాలువ చుట్టుపక్కల ప్రాంతాలు కలుషితం కావడంతో ఈ ప్రాంతంలో దుర్గంధం నెలకొంది. వేసవిలో నీటిమట్టం చాలా తక్కువగా ఉండేది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో క్రమేపీ పెరుగుతోంది. ఇకనైనా కాలువలో పూడిక తీసి పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం




ట్రోఫీ ప్రదానంలో ప్రముఖులు

**దొమ్మసంద్ర, మే 20:** క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని సర్జాపుర లయన్స్‌క్లబ్ ముఖ్యులు పూజాచంద్ర అభిప్రాయపడ్డారు. సర్జాపుర సమీపంలోని స్పోర్ట్‌జోన్‌ప్లస్ ఆవరణలో సర్జాపుర లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిక్స్ ఆన్ గ్రాస్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పూజాచంద్ర మాట్లాడుతూ ఇటీవలికాలంలో యువకులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చునన్నారు. యువతీ యువకులు బాల్యంనుంచే ప్రతిరోజూ కనీసం ఒక గంటపాటు వ్యాయామం, క్రీడలకు కేటాయించడం ద్వారా ఉత్తమ ఆరోగ్యం సాధ్యమని అభిప్రాయపడ్డారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో బృందంగా పాల్గొనడం ద్వారా ఇతర క్రీడాకారులతో సోదరభావం, సౌహార్ద్రభావాలు మెరుగవుతాయన్నారు. ఫుట్‌బాల్ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. తొలి బహుమతి గాజా ఎఫ్‌సీ జట్టు కైవశం చేసుకోగా, ద్వితీయ బహుమతిని బెళ్ళందూరు యునైటెడ్ జట్టు దక్కించుకుంది. తృతీయ బహుమతిని హెరిటేజ్ రైడర్ జట్టు పొందింది. ఇతర జట్ల క్రీడాకారులను లయన్స్ క్లబ్ పదాధికారులు అభినందించారు. టోర్నీలో బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పునీత్‌రెడ్డి, ఆనేకల్ తాలూకా రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ కేశవన్, సర్జాపుర లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రూపేశ్ చంద్ర, పదాధికారులు లయన్ సుపర్ణ చటర్జీ, లయన్ దీపా జాకోబ్, లయన్ సుదీప్‌సేన్, దీపాసంగీతా, అనుషా తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక కిక్కు @ రూ.100 కోట్లు

**హిందూపురం, మే 20:** ఎన్నికల చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ఆయా పార్టీల అభ్యర్థులు మద్యం మత్తులో ముంచెత్తారు. రెండు నెలలపాటు తాగేవారికి తాగినంత అనేలా మత్తులో దింపారు. ఈసారి కర్ణాటక మద్యంశ్రీసత్యసాయి జిల్లాలో ఏరులై పారిందని చెప్పవచ్చు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మత్తులో ముంచే ప్రయత్నం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలు గుర్తుకు రాకూడదనే ఉద్దేశంతో ఆ పార్టీ ముఖ్యనేతలు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మత్తులో దించారు. 2019 ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధం పూర్తిగా అమలుచేసి, 2024లో ఓటు అడుగుతానని వైసీపీ అధినేత జ గన్ హామీ ఇచ్చాడు. దానిని అమలు చేయకపోగా.. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు పక్కరాష్ట్రం మందుతో నిషా ఎక్కించారు. జిల్లావ్యాప్తంగా రెండు నెలలపాటు సుమారు వందకోట్ల మద్యం తాగేసినట్లు అంచనా.

### మద్యం మత్తులోకి ఓటర్లు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పోలింగ్ ముగిసే సమయానికి సుమారు రెండునెలల వ్యవధి ఉంది. ఈ నేపథ్యంలో బరిలో ఉంటామనుకున్న అభ్యర్థులు ప్రచారంలోకి వెళ్లారు. ఒక్కో పార్టీ ఒక్కో కార్యక్రమంతో ప్రచారం చేపట్టింది. అప్పటి నుంచే తమవెంట తిప్పుకునేందుకు మద్యం అందజేశారు. నామినేషన్ నుంచి పోలింగ్ రోజు వరకు రెట్టింపు స్థాయిలో ఓటర్లకు మద్యం అందించారు. ర్యాలీలు చేసినా, గ్రామాల్లో ప్రచారం నిర్వహించినా, రాష్ట్ర నేతలు ప్రచారాలకు వచ్చినా మద్యం అందించారు. ఎన్నడూలేనివిధంగా ఈసారి మద్యం అధికంగా విక్రయాలు సాగినట్లు సమాచారం. ఓటర్లను 56 రోజులపాటు ఆయా పార్టీల అభ్యర్థులు మద్యం, డబ్బులిస్తూ తిప్పుకున్నారు.

### తెగ తాగేశారు..

నోటిఫికేషన్ వెలువడినప్పట్నుంచి ఈనెల 13 పోలింగ్‌రోజు వరకు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రూ.వందకోట్లకుపైగా విలువైన మద్యాన్ని ఓటర్లకు అందజేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతి నియోజకవర్గం నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు రూ.10కోట్లకుపైగా మద్యానికే ఖర్చు చేసినట్లు అంచనా. కొన్ని నియోజకవర్గాల్లో అన్ని పార్టీలు కలిసి రూ.15 కోట్లు మద్యానికే ఖర్చు చేసినట్లు లెక్కలు వేస్తున్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో కలిపి రూ.వందకోట్లకుపైగానే మద్యం తాగేసినట్లు అంచనా. ఏపీ మద్యం ఇంతపెద్దఎత్తున ఓటర్లకు ఇచ్చి ఉండుంటే రెండింతల బిల్లు అయిఉండేదని ఒక అధికార పార్టీకి చెందిన నాయకుడే చెప్పడం గమనార్హం. ఎందుకంటే కర్ణాటకలో మద్యం ధరలు తక్కువ. ఇక్కడైతే రెండింతలు అధికం. ఈనెల 13న ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా రూ.10కోట్లకుపైగా మద్యం సేవించినట్లు ఓ అంచనా. ప్రతి పంచాయతీకి రూ.లక్షకు తగ్గకుండా మద్యం అందించినట్లు సమాచారం. ఈనెల 12, 13 తేదీల్లో కర్ణాటక సరిహద్దులో ఉన్న మద్యం షాపుల నుంచి భారీఎత్తున జిల్లాలోకి మద్యాన్ని తీసుకొచ్చారు. సరిహద్దుల్లో అన్నిచోట్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా కొంత మంది అభ్యర్థులు ముందస్తుగానే ఆయా నియోజకవర్గాల్లో డంప్ చేసుకున్నారు. మరికొంతమందైతే కర్ణాటక వారికే డెలివరీ చేసే బాధ్యత అప్పగించారు.

## రిసార్టులో జిప్‌లైన్ తెగిపడి మహిళ దుర్మరణం


**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** రామనగర జిల్లా హారోహళ్ళి జంగిల్ ట్రయల్స్ రిసార్టులో సరదాగా గడిపేందుకు వెళ్లిన ఓ మహిళ జిప్‌లైన్ ఆట ఆడుతుండగా వైరు తెగిపడ్డంతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బెంగళూరు శివారు ప్రాంతం అత్తిబెలెకు చెందిన రంజని (35) మృతి చెందిన మహిళ. రిసార్టుకు కుటుంబ సభ్యులతోపాటు రంజని వెళ్లారు. వైరుకు అమర్చిన జిప్‌లైన్ ద్వారా వెళ్లేందుకు సిద్ధం కాగా ఒక్కసారిగా జిప్‌లైన్ తంతి తెగిపోయింది. ఈ పరిణామంతో ఆమె కిందకుపడి మృతి చెందారు. బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హారోహళ్ళి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రిసార్టు మేనేజర్ పుట్టమాదును అదుపులోకి తీసుకున్నారు. రిసార్టులోని పలు ఆడే పరికరాలు నాసిరకంగా ఉన్నట్టు రంజని బంధువులు ఆరోపించారు.

## ప్రియురాలి ఆత్మహత్య.. ప్రియుడి బలవన్మరణం

**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** ప్రేమించిన యువతి ఆత్మహత్య చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక దక్షిణ కన్నడ జిల్లా మంగళూరు సమీపంలోని అతికారుబెట్టు నివాసి కార్తీక్ పూజారి (20) రైలుకిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కార్తీక్ ఆదివారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. కార్తీక్ కొంతకాలంగా చిత్రదుర్గలో బంధువులకు సంబంధించిన గ్యారేజ్‌లో పని చేస్తున్నాడు. ముల్కిలో డిగ్రీచదివే విద్యార్థినితో ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. ఇరువురూ కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. పెళ్లి చేసుకోవాలని భావించినా యువతి మైనరు కావడంతో సాధ్యం కాలేదు. ఇటీవలే ముల్కిలోని అవ్వ ఇంటినుంచి ప్రియురాలిని సొంతూరైన మూడుబిదరెకు తీసుకెళ్లారు. తమ ప్రేమను అడ్డుకోవాలనే ముల్కి నుంచి తీసుకొచ్చారని భావించిన యువతి శుక్రవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం చిత్రదుర్గ నుంచి అతికారిబెట్టుకు వచ్చిన కార్తీక్ ముభావంగా ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. ఆదివారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఎయిర్‌పోర్ట్ రోడ్డులో జాలీరైడ్

» యువకుడి అరెస్టు



జాలీరైడ్ ఇలా...

**బెంగళూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):** ప్రియురాలిని తొడపై కూర్చోబెట్టుకుని ఎయిర్‌పోర్ట్ రోడ్డు కొడిగేనహళ్ళి ఫ్లై ఓవర్‌పై జాలీరైడ్ చేసిన సిలంబరసన్ అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. కావల్‌భైరసంద్ర ఎంవీ లే అవుట్‌కు చెందిన సిలంబరసన్ రెండు రోజుల క్రితం రాత్రి ప్రియురాలిని తొడపై కూర్చో బెట్టుకుని యలహంక వైపు నుంచి హెబ్బాళకు ఫ్లై ఓవర్‌పై జాలీ రైడ్ చేశాడు. హెల్మెట్ లేకుండా రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరించిన మేరకు ఇదే మార్గంలో వెళ్లే పలువురు ఫోటోలు, వీడియోలు తీసి షేర్ చేశారు. వీటిని గుర్తించిన ట్రాఫిక్‌పోలీసులు సిలంబరసన్‌ను ఆదివారం అరెస్టు చేశారు. అతడు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేసేవాడని తెలుస్తోంది. అతడు జాలీరైడ్‌లో ప్రియురాలిని పైన కూర్చోబెట్టుకోవడం, రోడ్డు భద్రత పాటించకపోవడంపై యలహంక ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా పరిగణించారు. అతడి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని సిఫారసు చేశారు.